# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 22-9-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 44 పేజీలు:6 వెల: రూ.1/-


**నమ్మలేని నిజాలు**

కలల తోట
బంజారాలకు ఇండ్లు
ఎపుడు పండ్లు.

పరువు హత్య
నిందకు బొందతోడు
గాలిలో దీపం.

గుంపుల కాలం
కూడిక తీసివేత
పరాన్న జీవి.

క్రికెట్టు ఆట
కప్పు గెలిస్తే కోట్లు
లేదా చీవాట్లు

తెలుగు భాష
పల్కు చెరకుగడ
గడకు చీడ.



- రేడియమ్
సెల్: 9291527757

**శ్రీనిజాలు**

కట్టెబొమ్మ లౌతాయా
మా చేయి తాకితే?
మట్టి ముద్దలౌతాయా
మా గాలి సోకితే?

ముట్టు కుంటె మైలపడే
అందమైన మీ దేవుడు !
ఎవరు బాంచెన్ కాల్మొక్త
మొక్కుతీర్చు మా దేవుడు?



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

## నేటి నుంచి బతుకమ్మ చీరెల పంపిణీ : కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 21: తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగకు ఆడ పడుచులకు ప్రభుత్వం చీరెలను సారెగా అందిస్తోంది. ఈ నెల 25 నుంచి బతుకమ్మ వేడుకలు ప్రారంభంకానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ కానుకలను పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి కేటీఆర్ ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని నేతన్నలకు చేయూతనివ్వడంతోపాటు, ఆడబిడ్డలకు ప్రేమపూర్వక చిరుకానుక ఇవ్వాలన్న ఉధాత్తమైన ఉభయతారక లక్ష్యంతో కార్యక్రమాన్ని 2017లో ప్రారంభించినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో బతుకమ్మ చీరెల పంపిణీ కార్యక్రమానికి.. ఇప్పటికే అన్ని జిల్లాల కలెకర్లతో సమన్వయం చేసుకుంటూ, తమ టెక్స్‌టైల్ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని తెలిపారు. కార్యక్రమం ద్వారా సంక్షోభంలో చిక్కుకున్న నేతన్నలకు ఒక గొప్ప భరోసా వచ్చిందని, వారి వేతనాలు రెట్టింపు అయ్యాయన్నారు. తద్వారా వారు తమ కాళ్లపైన తాము నిలబడే పరిస్థితికి చేరుకున్నారని కేటీఆర్ పేర్కొన్నారు.

**నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపేందుకు..**

సమైక్య రాష్ట్రంలో ఉపాధి లేక ఆగమైన నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపేందుకు స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఎన్నో కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు. బతుకమ్మ చీరెల పంపిణీతో అటు ఆడబిడ్డలకు ఆనందంతో పాటు ఏడాది పొడవునా నేతన్నలకు ఉపాధి భరోసా దొరికిందని తెలిపారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత బతుకమ్మ చీరెల వంటి వినూత్నమైన కార్యక్రమాలతో నేత కార్మికుల ఒకవైపు ఆదుకునే ప్రయత్నం చేస్తుంటే, టెక్స్‌టైల్ ఉత్పత్తులపైన జీఎస్టీ వంటి నిర్ణయాలతో నేతన్నలను నిలువునా ముంచే నేత కార్మికుల వ్యతిరేక చర్యలను కేంద్రం తీసుకుంటుందని కేటీఆర్ అన్నారు. కేంద్రం నేతన్నలను, వారి పరిశ్రమను, వారి జీవితాలను పట్టించుకోకున్నా, ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో నేతన్నలకు కోసం తాము నిరంతరం నిబద్ధతతో పనిచేస్తామని కేటీఆర్ అన్నారు. ఇందులో భాగంగా ఈ సంవత్సరం సైతం సూమారు కోటి బతుకమ్మ చీరలను పంపీణి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది గతంలో కన్నా మరిన్ని ఎక్కువ డిజైన్లు, రంగుల, వెరైటీల్లో ఈ చీరలను తెలంగాణ టెక్స్‌టైల్ శాఖ తయారు చేసిందని వివరించారు.

**24 విభిన్న డిజైన్లు.. 10 రకాల రంగుల్లో..**

గ్రామాల నుంచి వచ్చిన మహిళా ప్రతినిధుల అభిప్రాయాలు, ఆసక్తులు, నిఫ్ట్ డిజైనర్ల సహకారంతో సరైన డిజైన్లు, అత్యుత్తమ ప్రమాణాలతో ఈ ఏడాది బతుకమ్మ చీరెల నూతన డిజైన్లతో ఉత్పత్తి చేశామన్నారు. ఈ సంవత్సరం 24 విభిన్న డిజైన్లు, పది రకాల ఆకర్షణీయ రంగుల్లో మొత్తం 240 రకాల త్రెడ్ బోర్డర్ (దారపు పోగుల అంచుల)తో తయారు చేయబడిన 100శాతం పాలిస్టర్ ఫిలిమెంట్ నూలు చీరలను టెక్స్‌టైల్ శాఖ తయారు చేసిందన్నారు. మహిళలకు 92లక్షల సాధారణ చీరెలు, వయోవృద్ధులకు తొమ్మిది మీటర్ల పొడువున్న చీరెలు 8లక్షలు తయారు చేయించామన్నారు. మొత్తంగా కోటిచీరెలను రాష్ట్రంలో ఆహార భద్రతా కార్డు కలిగిన ప్రతీ ఆడబిడ్డకు అందించనున్నట్లు చెప్పారు. నేతన్నలకు గౌరవ ప్రదమైన ఉపాధి కల్పిస్తున్న ఈ బతుకమ్మ చీరెల ప్రాజెక్టు కోసం రూ. 339.73 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు 5.81 కోట్ల చీరెరలను ఆడబిడ్డలకు ఐదు దఫాలుగా అందించినట్లు కేటీఆర్ వివరించారు.

## హైదరాబాద్‌లో రూ. 19 లక్షల విలువ చేసే బాణా సంచా సీజ్

హైదరాబాద్, సెప్టెంబర్ 21: పాతబస్తీలో సెంట్రల్ క్రైమ్ స్టేషన్ స్పెషల్ టీమ్స్ ఇవాళ తనిఖీలు చేపట్టాయి. చెలపురాలోని ఓ గోడౌన్‌లో నిల్వ ఉంచిన బాణా సంచాను పోలీసులు కనుగొన్నారు. అక్రమంగా నిల్వ ఉంచిన ఈ ఫైర్ క్రాకర్స్‌ను పోలీసులు సీజ్ చేశారు. ఈ బాణాసంచా విలువ రూ. 19.24 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తీసుకొచ్చి, చెలపురాలో నిల్వ చేస్తున్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ గోడౌన్ యజమాని అనిల్ కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివిధ కంపెనీలకు చెందిన 108 రకాల బాణాసంచాను గుర్తించారు పోలీసులు. అనిల్ కుమార్‌ను చార్మినార్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## మృతుల కుటుంబాలకు రూ.14 లక్షల నష్టపరిహారం : ఎమ్మెల్యే దాసరి

కరీంనగర్, సెప్టెంబర్ 21 (నేటినిజం ప్రతినిధి): రాజధాని ఎక్స్ ప్రెస్ రైలు ఢీకొని ముగ్గురు మృతిచెందారని బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మృతుల కుటుంబాలను పెద్దపల్లి జిల్లా రామగుండంలోని ఆస్పత్రి వద్ద పరామర్శించి ఓదార్చారు. అనంతరం కాంట్రాక్టర్ తో ఐదు గంటల పాటు సుధీర్ఘంగా చర్చించి పెద్దకల్వల, సుల్తానాబాద్ కు చెందిన మృతులు పెగడ శ్రీనివాస్, వేణుల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.13.50 లక్షల నష్టపరిహారం, దహన సంస్కారాలకు రూ.50 వేలు ఇచ్చేలా ఒప్పించామన్నారు.

**చరిత్రలో నేటినిజం**



కం॥ నయపథమున సాగెడి - వి
స్మయమును గలిగించెడి - సినిమా రంగములో
జయమును సతతము బొందెడి -
సాయిబాబాత్ముని "విజయబాపినీడు"ను దలతున్!!

(సెప్టెంబర్ 22 విజయబాపినీడు జయంతి...)



-రాధశ్రీ
సెల్:9494481210

## పెన్షన్‌లు పేదలకు ప్రభుత్వం అందిస్తున్న భరోసా : మంత్రి తలసాని



హైదరాబాద్, సెప్టెంబర్ 21: ఆసరా పింఛన్లు పేదలకు ప్రభుత్వం అందిస్తున్న భరోసా అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం బేగంపేట, గోషా మహల్‌లో లబ్ధిదారులకు నూతన పెన్షన్ కార్డులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..దేశంలో ఎక్కడా లేని విధంగా వృద్ధులు, వితంతువులకు రూ. 2016, వికలాంగులకు రూ. 3016 అందిస్తున్న ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే అని మంత్రి పేర్కొన్నారు.

పేదింటి ఆడబిడ్డల పెండ్లిళ్లు భారం కావొద్దని సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు అమలు చేస్తున్నారని ఆయన తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలవుతుంటే ప్రతిపక్షాలు కండ్లు ఉన్న కబోదులుగా ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు.

ప్రతి పక్షాలు ఇకనైనా తమ పద్ధతి మార్చుకొని మంచి పనులను చేస్తున్న ప్రభుత్వానికి సహకరించాలని హితవు పలికారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

## పాదయాత్ర కాదు, మోకాళ్ల యాత్ర చేసిన ప్రజలు నమ్మరు.. బండి సంజయ్‌పై సబిత ఆగ్రహం

రంగారెడ్డి, సెప్టెంబర్ 21: మహేశ్వరం నియోజకవర్గములో ఏర్పాటు కావాల్సిన ఐటీఐఆర్ ప్రాజెక్ట్ ను ఎందుకు రద్దు చేశారని మంత్రి సబితా ఇంద్రారెడ్డి బీజేపీ నేత బండి సంజయ్ ను ప్రశ్నించారు. సరూర్ నగర్ డివిజన్ లో పెన్షన్ల పంపిణీ అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ తీరుపై నిప్పులు చెరిగారు. గత 8 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. తెలంగాణకు నయాపైసా పని చేయలేదని, నిధులు ఇవ్వడం లేదని అన్నారు. న్యాయ బద్దంగా రావాల్సిన నిధులకు, ప్రాజెక్టులకు మొండి చేయి చూపుతూ స్వార్థం కోసం, అధికారం కోసం పాదయాత్ర చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రం నుంచి ప్రాజెక్టులు, ఫండ్స్ తీసుకురాలేని బండి సంజయ్ కు పాదయాత్ర చేసే అర్హత లేదని, అదంతా బూటకపు యాత్ర అన్నారు సబితారెడ్డి.

పాదయాత్ర కాదు మోకాళ్ల యాత్ర చేసినా బండి సంజయ్‌ని ప్రజలు నమ్మరని మంత్రి సబిత విమర్శించారు. 8 సంవత్సరాలలో తెలంగాణకు బీజేపీ చేసిన మేలు ఏంటో చెప్పాలని అన్నారు. కేంద్రం ఒక్క ఉద్యోగం ఇవ్వకపోగా ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో 90వేల ఉద్యోగాలు భర్తీ ప్రక్రియ చేపట్టారన్నారు. 8 ఏళ్ల కాలంలో తాము లక్ష 30 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామన్నారు. దేశ వ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీలు భర్తీ చేయకపోగా, ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ లక్షలాది మంది ఉద్యోగులను ఇంటికి పంపుతున్న ఘనత కేంద్రానిది అని మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఎద్దేవా చేశారు.

ఏ హక్కుతో, ఎం చేసారని సంజయ్ ఈ ప్రాంతంలో పాదయాత్ర చేస్తున్నారని సబితారెడ్డి ప్రశ్నించారు. స్థాయికి మించి విమర్శలు చేయొద్దని, ముఖ్యమంత్రి కేసీఆర్ అనునిత్యం తెలంగాణ ప్రజల కోసం ఆలోచిస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. మీరు పాలిస్తున్న రాష్టాల్లో 2 వేల రూపాయల పెన్షన్ ఇస్తున్నారా? డయాలసిస్,



బోధకాలు, ఒంటరి మహిళలకు బీజేపీ ప్రభుత్వాలు పెన్షన్ ఇస్తున్నాయా? అని ప్రశ్నించారు. మీరు చేస్తున్నయాత్ర ప్రజల కోసం కాదు అని అందరికి తెలిసిపోయింది. అనవసరంగా ముఖ్యమంత్రిపై విమర్శలు చేస్తే ఉరుకోబోమన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో

ఐటీఐఆర్ ను రద్దు చేసి, మరో ప్రతిష్టాత్మక ఫార్మాకు ఎలాంటి సహకారం అందించటం లేదని వ్యాఖ్యానించారు.

## ఇవ్వని హామీలను అమలు చేసిన ఘనత టీఆర్ఎస్ పార్టీదే : మంత్రి జగదీష్ రెడ్డి




నల్లగొండ, సెప్టెంబర్ 21: ఎన్నికల్లో చెప్పిన మ్యానిఫెస్టో మొత్తాన్ని అమలు చేసి.. ఇవ్వని హామీలను కూడా అమలు చేసి ప్రజల మనసును గెలుచుకున్న ఏకైక పార్టీ టీఆర్ఎస్ అని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. చండూరులో నిర్వహించిన టీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం, వన భోజనాల కార్యక్రమానికి మంత్రి హాజరై మాట్లాడారు

కళ్యాణ లక్ష్మి పథకం సమాజంలో గొప్ప మార్పును తీసుకొచ్చిందన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన అనేక సంక్షేమ పథకాలు ప్రజల కష్టాలను దూరం చేసాయన్నారు. సీఎం కేసీఆర్ మానవత్వంతో పాలన చేస్తున్నారని ప్రశంసించారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే గొప్ప నాయకుడు కేసీఆర్ అన్నారు. ఆకలి అన్నదే లేని ఏకైక రాష్ట్రనీ తెలంగాణ. గతంలో తాగు నీళ్లకు కూడా తండ్లాట పడ్డాం. ఇప్పుడు మిషన్ భగీరథతో తాగు నీటి గోస తీరిందని మంత్రి తెలిపారు.

తెలంగాణ దేశానికే అన్నపూర్ణగా మారింది. ఫ్లోరైడ్ భూతం అంతం చేశామని కేంద్రమే ఒప్పుకుందన్నారు ఇది కేసీఆర్ దర్శనికతతోనే సాధ్యం అయిందన్నారు. కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలను దేశ ప్రజలంతా అడుగుతున్నారు. అందుకే బీజేపీ వాళ్లు తెలంగాణ పైన దాడికి దిగారన్నారు. బీజేపీని ఎక్కడికక్కడ నిలదీయాలి. టీఆర్ఎస్ కార్యకర్తలు సైనికుల వలే పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, నోముల భగత్, మాజీ ఎమ్మెల్యే కుసుకుట్ల ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఆకర్షితులయ్యే టీఆర్ఎస్‌లో చేరికలు : మంత్రి మల్లారెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 21: సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులయ్యేవివిధ పార్టీల నుంచి టీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు.

మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ 2వార్డులోని వివిధ పార్టీలకు చెందిన 60 మంది యువకులు బుధవారం మంత్రి మల్లారెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. మంత్రి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అనంతరం ఆయన మట్లాడుతూ.. దేశంలో ఎక్కడ లేని అభివృద్ది తెలంగాణలో జరుగుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ ఇతర రాష్టాలకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

రాష్ట్రంలోని ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకం అందుతుందని మంత్రి వివరించారు. . 2వార్డులోని సాయిగౌడ్, సుధీర్‌రెడ్డి,అరవింద్ క్రాంతి,సాయి, భరత్ రెడ్డి, వెంకటస్వామి తదితరులు పార్టీలో చేరారు.

కార్యక్రమంలో పోచారంటీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మందాడి సురేందర్ రెడ్డి, కొండల్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి శేఖర్,టీఆర్ఎస్ వార్డు అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, నాయకులు బద్దం జగన్ మోహన్ రెడ్డి, ఎన్.కాశయ్య జి.శేఖర్,శశిధర్ రెడ్డి,కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేసీఆర్ సీఎం అయ్యాకే విద్యా రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత : ఉప్పల శ్రీనివాస్ గుప్తా




హైదరాబాద్, సెప్టెంబర్ 21: కేసీఆర్ సీఎం అయిన తర్వాతే విద్యా రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని, అన్ని విధాలుగా ప్రోత్సాహకాలు, సహాయ సహకారాలు అందిస్తున్న ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వమేని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. హైదరాబాద్ రామంతపూర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఉప్పల శ్రీనివాస్ గుప్తా ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ? అంతకు ముందున్న ప్రభుత్వాలు విద్యా వ్యవస్థను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చిన తర్వాత విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో విద్యా రంగ వ్యవస్థ అభివృద్ధికి కృషి చేస్తున్న ఘనత కేసీఆర్ దేనన్నారు. రామంతపూర్ పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం తనవంతుగా రూ. 20 వేలను ఇస్తున్నట్లు ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షులు బోనగిరి శ్రీనివాసులు, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా జనరల్ సెక్రెటరీ సంబు పాండయ్య గుప్తా, రామంతపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్ రావు, హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సీనియర్ ఉపాధ్యక్షులు కాచం కృష్ణమూర్తి గుప్తా, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ పొలిటికల్ కమిటీ చైర్మన్ బచ్చు శ్రీనివాస్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ కూర నాగరాజు, టీఆర్ఎస్వీ నాయకులు ప్రశాంత్ గౌడ్, ఉడుత పురుషోత్తం, కాచం కృష్ణమూర్తి, కాసం వెంకట హరి గుప్తా, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా సెక్రెటరీ ట్రెజరర్ తాటి శ్రీనివాస్ గుప్తా, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ మేడ్చల్ అడ్వైజర్ అండ్ ట్రెజరర్ పూరే నగేష్ గుప్త, గడ్డం సాయి, గట్టు ప్రకాష్, ప్రధానోపాధ్యాయులు సిహెచ్.సాంబయ్య, చంద్రశేఖర్, సుజాత జోషి, నాగరాజు, ఎండి అక్బర్, సురేంద్ర చారి, అనిత రెడ్డి, సత్యనారాయణ, శ్రీలత, శ్రీధర్, నీలిమ, వసంత, అరుణజ్యోతి, ప్రమీల, పద్మాలత, సురేంద్రనాథ్ ఠాగూర్, వెంకటేశం, స్వప్న రాణి, రాధిక, శ్రీనివాస్, సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘం నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రి బాటలోనే మిగతా మావోలు లొంగిపోవాలి : డీజీపీ మహేందర్ రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 21: మావోయిస్టు కీలక నేత సావిత్రి బాటలోనే మిగతా మావోయిస్టులు కూడా లొంగిపోవాలని రాష్ట్ర డీజీపీ మహేందర్ రెడ్డి కోరారు. సావిత్రి లొంగుబాటు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీజీపీ మహేందర్ రెడ్డి మాట్లాడారు. 30 ఏండ్ల పాటు ఆమె మావోయిస్టు పార్టీలో చురుకుగా పని చేసిందని, పోలీసులపై జరిపిన 9 ప్రధాన దాడుల్లో ఆమె పాల్గొన్నారని తెలిపారు. మూడేండ్ల క్రితం తన భర్త మావోయిస్టు రామన్న చనిపోయినప్పుడు కనీసం తనకు సమాచారం ఇవ్వలేదని సావిత్రి తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. మారిన పరిణామాలు, గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో సావిత్రి జనజీవన స్రవంతిలో కలుస్తారని డీజీపీ తెలిపారు. సావిత్రి బాటలోనే మిగతా మావోయిస్టులు లొంగిపోవాలని మహేందర్ రెడ్డి కోరారు. సావిత్రిపై ఛత్తీస్‌గఢ్‌లో రూ. 10 లక్షల రివార్డు ఉందని పేర్కొన్నారు. తక్షణ సాయం కింద సావిత్రికి రూ. 50 వేలను మహేందర్ రెడ్డి అందించారు.

1993లో సావిత్రి ఛత్తీస్‌గఢ్ కుంట దళంలో చేరారు. ఆ సమయంలో రామన్న మావోయిస్టు నాయకుడిగా పని చేశారు. దళంలో చేరిన తర్వాత రామన్నతో సావిత్రికి వివాహం జరిగింది. 30 ఏండ్లలో 350 మంది ఆదివాసీలను సావిత్రి మావోయిస్టు పార్టీలో చేర్పించారు. సావిత్రి కుమారుడు రంజిత్ మావోయిస్టుగా పని చేసి ఏడాది క్రితం లొంగిపోయాడు. రాష్ట్రంలోకి మావోయిస్టులు ఎప్పుడైనా ప్రవేశించే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉన్నారని ఓ జర్నలిస్టు అడిగిన ప్రశ్నకు డీజీపీ మహేందర్ రెడ్డి సమాధానం ఇచ్చారు.

## జిల్లా కలెక్టర్‌కి శుభాకాంక్షలు తెలిపిన జెడ్పీ సభ్యులు



సంగారెడ్డి సెప్టెంబర్ 21(నేటి నిజం ప్రతినిధి)మంగళవారము నాడు జిల్లా పరిషత్ సమావేశనికి జిల్లా కలెక్టర్ గా భాద్యతలు చేపట్టిన తరువాత మొదటి సమావేశనికి కలెక్టర్ శరత్ వచ్చిన సందర్భంగా మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపినజెడ్పిటిసి పైతర మీనాక్షీసాయికుమార్ , తెరాస రాష్ట్ర నాయకులు పైతర సాయికుమార్, మొగుడంపల్లి జడ్పిటిసి అరుణ మోహన్ రెడ్డి , న్యాల్కల్ జెడ్పిటిసి స్వప్న భాస్కర్, కోహిర్ జెడ్పిటిసి రాందాస్ ,మరియు జిల్లాలోని మండలాల జెడ్పిటిసి లు ఎంపిపిలు లు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com

2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 22-9-2022


## నానీలు

ధ్రువాలే
కలుస్తున్నాయి
మీరు ద్రవాల్లా
విడిపోతున్నారేమిటి?

నీటి దాహంతో
దేహానికి హాయి
దురాశా దాహంతో
నిదురలేని రేయి.

ప్రతి పనికీ వెల
ఇదేమి రాజ్యం
ప్రతినిధులా!
ప్రతి దానికీ నిధులా!!

ఆకలి అహం
అందరికీ సమానం
మరి ఆహారం!
కొందరికే స్వాధీనం



-డా॥ శిరీష
సెల్:98660 50220

## ఘంటారావం

చితిమంటగ మారాడని
మురవకు
చీకటిని చీల్చే మంటని
మరువకు.

లోభం
లోకువ దారి
ప్రలోభం
పక్కదారి.

హృదయంలేని
వైద్యం
ఎడారిలో
సేద్యం.



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964




## గాయని గీతా బ్రహ్మంకు వంశీస్వర్ణోత్సవ్ పురస్కారం

అమెరికాలోని హ్యూస్టన్ నగరంలో స్థిరపడిన ప్రముఖ గాయని హ్యూస్టన్ తెలుగు లలిత కళాసమితి పూర్వ అధ్యక్షురాలు గీతా బ్రహ్మం నగరంలోని శ్రీముఖి కాంప్లెక్స్‌లో మంగళవారం జరిగిన సినీ పాటల విభావరిలో వంశీ సంస్థల వ్యవస్థాపకుడు వంశీ రామరాజు, వంశీ స్వర్ణోత్సవ పురస్కారాన్ని గీత బ్రహ్మంకు బహూకరించారు. కార్యక్రమంలో సహ గాయకులు వినోద్‌కుమార్, సాయిమాధురి, బాల కామేశ్వరరావు, లలిత తదితరులతో కలిసి సాయి లలిత మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సినీ పాటల విభావరి అలరించింది. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు డాక్టర్ టీవీరావు, గొర్తి చంద్రశేఖర్ పాల్గొని అభినందనలు తెలిపారు.



## కలలను శ్రుతి చేద్దాం

జారుడుబల్లపై జారిన బాల్యం
యవ్వనంలోకి దూకుతుంది
జ్ఞాపకాలను వెంటేసుకుని

జారుడుబల్ల గేలంవేసి
బాల్యాన్ని లాగేస్తుంటే
కాలం గెలిచేసి గెలిచేశానుకుంటుంది.

జారిపోయే జీవితం
ఆశను ఊతం చేసుకుంటే
కన్నీటి బాల్యానికి పారే జలపాతం
జారుడు బల్ల

జారిపోయే కలలను
పారిపోయే ధైర్యాన్ని
పట్టుకొచ్చే సంజీవిని జారుడుబల్ల.

పరిగెత్తే కాలంతో పోటీపడలేక
చతికిలబడుతోంది నేటి బాల్యం
జారుడుబల్లని పరిచయం చేద్దాం
అది బాల్యాన్ని శ్రుతి చేస్తుంది.



-సి.యస్.రాంబాబు
8374818961

## అద్భుత పాత్రల్లో నటించిన గొప్ప సాధకుడు అక్కినేని-డా॥ కె.వి. రమణాచారి



పురస్కారం ప్రదానం చేస్తున్న డా॥ కె.వి.రమణాచారి, సి.యన్. గోపీనాథరెడ్డి, దైవజ్ఞశర్మ.

వివిధ రాష్ట్రాలకు చెందిన వాగ్గేయ కారులు, పదసాహితీకారుల వంటి అద్భుత పాత్రలను అందరూ గర్వించేలా పోషించిన అక్కినేని నాగేశ్వరరావు గొప్ప సాధకుడని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా॥ కే.వీ. రమణాచారి అన్నారు. జీవించినంతకాలం నటిస్తానని చెప్పిన గొప్ప వ్యక్తి ఆయన అన్నారు. సుదీర్ఘకాలం నటించిన అక్కినేని నాగేశ్వరరావు ఉన్నత శిఖరాలను చేరుతున్నారని ఆయన జీవితం క్రమశిక్షణ నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. శ్రీ భారతి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో అక్కినేని జయంతిని పురస్కరించుకుని భిన్న రంగాలకు చెందిన ప్రముఖులు శ్రీభారతి అక్కినేని జీవిత సాఫల్యపురస్కారం ప్రదాన సభ జరిగింది. డా॥ కె.వి.రమణాచారి ముఖ్య అతిథిగా పాల్గొని నటి రోజారమణి, సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్, వంశీ సంస్థల అధినేత డా॥ వంశీ రామరాజు, గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి గాయకుడు రామాచారిలను జీవన సాఫల్య పురస్కారాలతో సత్కరించారు. విశ్రాంత పోలీస్ అధికారి సీవన్ గోపీనాథరెడ్డి మాట్లాడుతూ అక్కినేని నటించిన ప్రతి సినిమా ఒక పాఠం అన్నారు. నంగునూరి చంద్రశేఖర్, దైవజ్ఞశర్మ తదితరులు ప్రశంసలు తెలిపారు. చింతలపాటి సురేష్, రామాచారి శిష్యబృందం, వీకే దుర్గ తదితరులు గీతాలను పాడి వినిపించారు.

## అభ్యుదయ కవి "పొనుగోటి"






అటు రాజకీయ రంగాన్ని ఇటు సాహిత్య రంగాన్ని సమానంగా నిర్వహించి నల్లగొండ జిల్లాలో ప్రముఖ కవిగా,రచయితగా, స్వాతంత్ర్యం సమర యోధుడుగా, 'తొలి వెలుగు' పక్షపత్రిక సంపాదకుడుగా, రాణించిన పొనుగోటి నరసింహారావు 1937 సం॥ దసరా రోజున రామన్నపేట మండలం దుబ్బాక గ్రామంలో అనంతమ్మ,కిషన్‌రావు దంపతులకు ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. దుబ్బాక నరసింహారావుగా ప్రసిద్ధి పొందిన వీరు తొమ్మిదో తరగతిలోనే గేయ రచన మొదలు పెట్టి అందర్నీ ఆశ్చర్య పరిచారు. పాఠశాల విద్యార్థి దశలో వ్యాస రచన పోటీలో ప్రథమ బహుమతి దక్కించుకున్న ప్రతిభాశాలి. సైఫాబాద్ కాలేజి ఇంటర్ విద్యార్థిగా కళాశాల మ్యాగజైనులో "వ్యావహారిక భాష–పుట్టు పూర్వోత్తరాలు" అనే అంశంపై వీరు రాసిన వ్యాసం ప్రథమ బహుమతిని మహాకవి దాశరథి నుండి అందుకున్నారు.

చిన్న నాటినుండి వ్యాస రచన, గేయ రచనల యందు ఆసక్తిని కనబరిచిన నరసింహా రావు నల్లగొండలో "సాహితీ స్నేహితులు, చైతన్య కళా స్రవంతి' వంటి సాహిత్య సంస్థలలోను, జిల్లా రచయితల సం ఘం కార్యదర్శిగాను కీలక పాత్రలను పోషించి జిల్లాలో సాహిత్యోత్సాహాన్ని కలిగించినా రు.

నరసింహారావు 1969లో రామన్నపేట తాలూకా యువ జన కాంగ్రెస్ కార్యదర్శిగా, 1964–86 వరకు జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా పని చేశారు. 1961 నుండి దుబ్బాక గ్రామ సర్పంచ్‌గా వుండి గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేసిన కార్యశీలి. జిల్లా గ్రంథాలయ సంస్థలో, భువనగిరి కేంద్ర సహకార బ్యాంక్ డైరెక్టర్‌గా, జిల్లా ప్రాంతీయ రవాణా సంస్థ సభ్యులుగా రామన్నపేట మార్కెట్ కమిటీ అధ్యక్షులుగా, వ్యవసాయాభివృద్ధి బ్యాంక్ డైరెక్టర్‌గా పలు ఉన్నత పదవులను నిర్వహించి పదవులకు వన్నె తెచ్చి ప్రముఖుల ప్రశంసలకు పాత్రులైనారు.

రామన్నపేట నియోజక వర్గం నుండి శాసన సభ్యుడిగా ఎన్నికైన పెరిక రాజరత్నం (కవి, నటుడు)తొ కలిసి 'తొలి వెలుగు' పక్షపత్రికకు సంపాదకత్వం వహించి కొంతకాలం నడిపారు. ఈ పత్రిక జిల్లాలోని సాహిత్యం, సాంస్కృతిక, రాజకీయ అంశాలకు ప్రాముఖ్యతనిచ్చి కవులు రచయితలు కళాకారులను ప్రోత్సహించినారు.

నరసింహారావు వర్తమానాలు పేరుతో నానీలను, 'అక్షరాలు' పేరుతో వచన కవిత్వాన్ని(2009) ముద్రణ రూపంలోకి తీసుకొచ్చి కవిగా గుర్తింపు పొందినారు. వీరు సుమారు వందకు పైగా సమీక్షా వ్యాసాలను రాసి 'నేటినిజం' దిన పత్రికలో ప్రచురింపజేశారు. వ్యాస సంపుటి వెలుగు చూడకుండానే కన్ను మూశారు. నరసింహారావు జిల్లా ఆధునిక కవిత్వంలో తొలితరం కవి అభ్యుదయ భావాలు కలిగిన వారు నిజాన్ని, నిర్భయంగా, నిష్టూరంగా, నిర్మొహమాటంగా చెప్పడంలో పొనుగోటికి వారే సాటి.

కవికి డొక్కశుద్ధి మాత్రమే చాలదు
చిత్తశుద్ధి లేకుంటే కుదరదు
కలల ఆకాశంలో విహరించ డం కాదు
కల్లోల జన జీవితాలను ఈదాలి కవి
పీడితుల పక్షం వహించి వారి కడగండ్లను
కవిత్వీకరించాలి' అని అంటారు.

నరసింహారావు నిఖార్సయిన, నిబద్ధత కలిగిన కవి సమాజాన్ని చైతన్య పరచడానికి, భ్రష్టుపట్టిన రాజకీయ విలువల్ని ఎండగట్టడా నికి ఆయన కలం పట్టారు. కానీ ఆయనకు రావలసిన గుర్తింపు రాలేదు. తెలంగాణ కోసం వందలాది నానీలను రాసిన పొనుగోటిని తెలుగు విశ్వ విద్యాలయం, తెలంగాణ సారస్వత పరిషత్‌లు పూర్తిగా విస్మరించి అడుక్కున్న వారికి అవార్డులను అందజేస్తూ రాలిపోతున్న సాహితీ కుసుమాలను పట్టించుకోకుండా వుంది.

*(తేది. 15-9-2022న పొనుగోటి అకాల మృతికి సంతాపం ప్రకటిస్తూ..)*



-పున్నమి
సెల్: 9396610639

నివాళి

## సాహితి బంధువు నిజాం వెంకటేశం



-బి.నర్సన్
9440128169

ప్రముఖ సాహితీవేత్త నిజాం వెంకటేశం 18 -09 -2022 ఆదివారం సాయంత్రం కన్నుమూశారు. ఆయన ఆకస్మిక మరణం తెలుగు సాహితీ ప్రపంచాన్నిగ్భ్రమ పరిచింది. సుమారు అర్థ శతాబ్దం పాటు మూడుతరాల రచయితలకు వారధిగా నిలిచిన ఆయన నిష్క్రమణ ఎవరూ పూడ్చలేనిది. ఈ కాలంలో ఆయనంతటి పుస్తక ప్రేమికుడు కానరాడు. అదే దినచర్యగా భుజాన సంచిలో నాలుగు కొత్త పుస్తకాలు వేసుకొని గడప దాటడం ఆయన అలవాటు. తాను చదివాక ఈ పుస్తకాన్ని ఫలానా ఆయన చదవాలని ఆశించి వారికి అందించే పనిలోనే రోజు గడుస్తుంది. అందుకోసం హైదరాబాద్ ఏ మూలకైనా వెళ్తాడు. ఆయన రాకతో ఆ ఇంటికి సాహితీ కళ వస్తుంది. పుస్తకాల నుండి చర్చ కుటుంబ, ఆరోగ్య సమస్యల దాక వెళుతుంది. తనకు తెలిసిన సకల విషయాల పరిజ్ఞానాన్ని వారికీ పంచి సెలవు తీసుకుంటాడు. ఇలా సాగే వెంకటేశం జీవనయానం శాశ్వతంగా ఆగిపోయింది. ఆయన కోసం ఎదిరిచూసే వందలాది ఇళ్లు ఇక బోసిపోతాయి. 76 ఏళ్ల వయసులో కూడా అలుపెరుగకుండా, ఎంతో ఉత్సాహంగా సాహిత్య సభలు, సమావేశాలకు హాజరవుతూ కవులు, రచయితలకు ప్రోత్సాహాన్ని అందిస్తూ తానూ తృప్తినొందేవాడు. వెంకటేశంతో తమ అనుబంధాలను గుర్తు చేసుకుంటూ ఆయన హఠాన్మరణంపై ఎన్నో సాహితీ కుటుంబాలు అశ్రునివాళులు అర్పిస్తున్నాయి. ఒక ఆత్మబంధువును కోల్పోయిన బాధను వందలాదిగా ఆయన అభిమానులు ప్రకటిస్తున్నారు. సాహిత్యాన్ని, పుస్తకాన్ని, రచయితని,మంచితనాన్ని సమానంగా ఏకకాలంలో ప్రేమించిన అరుదైన వ్యక్తి ఆయన. వెంకటేశంకున్న పరిచయాలన్ని గాఢమైనవే. వయో తారతమ్యం లేకుండా కలుపుగోలుగా, నిగర్వంగా మెదిలే మనిషిగా అందరి గౌరవాన్ని పొందాడు. ఇంకా చెప్పాలంటే ఎదుగుతున్న కవులు, రచయితలను ఆయన చేరదీసి మరీ ప్రోత్సహించేవాడు.

సాహితీవేత్తగా తెలుగు, ఆంగ్ల, హిందీ రచనలపై లోతైన పరిజ్ఞానం గల ఆయన రచయిత లకు ఎన్నో విలువైన సూచనలు చేసేవారు. కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలకు చెందిన అన్ని తరాల రచయితలు ఆయనను సాహితీ గురువుగా భావిస్తారు. తమకు ఎన్నో గొప్ప పుస్తకాలను పరిచయం చేసి తమ రచనలకు మార్గదర్శకుడిగా ఉన్నారని కవి జూకంటి జగన్నాథం, రచయిత పత్తిపాక మోహన్ తదితరులు ప్రకటించిన సందర్భాలున్నాయి. ఒక టివి ఛానల్ ఇంటర్వ్యూ కోసం కథా రచయిత పెద్దింటి అశోక్ కుమార్ తనకు తోడుగా తన పరిచయకర్తగా కోరి మరీ వెంకటేశంను స్టూడియోకి తీసుకెళ్లాడు. పెద్దింటి కథలు, నవలలపై ఆయన విశ్లేషణ కార్యక్రమానికి వన్నె తెచ్చింది. తనను ఆహ్వానించిన సభల్లో వక్తగా ఎన్నో కొత్త విషయాలు సభికులకు వివరించేవాడు. ఆయన మాటలు, ప్రసంగాలు రికార్డు చేసి ప్రచురిస్తే అవి ఎంతో విలువైన సాహిత్య వ్యాసాలయ్యేవి.గంటల తరబడి చదవడం పట్ల ఉన్న ఆసక్తి ఆయన రాయడంపై చూపలేదు. కూచుంటే ఏక బిగిన పుస్తకాన్ని పూర్తిచేసే పఠనవేగం ఆయనది.

తెలుగు, హిందీ, ఇంగ్లిష్ ఈ భాష పుస్తకమైనా ఆయనకు ఒక్కటే. అలిశెట్టి ప్రభాకర్ తో వెంకటేశం అనుబంధం విశేషమైనది. పెద్దన్నలా ఆయన సరిదిద్దేందుకు ఎంతో ప్రయత్నించాడు. 1988 లో ప్రభాకర్ ను జగిత్యాలకు రప్పించి ఆయన ఆరోగ్య, కుటుంబ బాధ్యతలను తనపై వేసుకున్నాడు. అయితే 'సిటీలైఫ్' ఆగిపోతుందని ఓ కాగితం ముక్క రాసి పెట్టి అలిశెట్టి తిరిగి హైదరాబాద్ కు వచ్చేశాడు. జేబు ఖాళీగా ఉన్న అలిశెట్టిప్రభాకర్ ఒకరి సొమ్ము ఆశించేవాడు కాదు. తన భావజాలానికి విరుద్ధంగా ఉన్నవారిని పూర్తిగా దూరం పెట్టేవాడు. అయితే వెంకటేశం చేసే ఆర్థిక సాయానికి మాత్రం ప్రభాకర్ అడ్డుచెప్పేవాడుకాదు. దానిని ప్రస్తావిస్తూ అలిశెట్టి ఓ కవితలో–'ఘుంల్లునా గచ్చుమీద రూపాయి/ బిళ్ళ మోగినట్లు/ నిజాం వెంకటేశం వస్తాడు/ నన్నూ నా రోగాన్ని మందుల్నీ కవిత్వాన్నీ/ కవుల్నీ తిట్టినా తిట్టు తిట్టకుండా/ కసితీరా తిట్టి / మధ్యలో రూటు మార్చి/ మహాశ్వేతాదేవిని మెచ్చుకొని/ తరచుగా సాహిత్య సభల్లో పాల్గొన/ లేనందుకు నొచ్చుకొని/ నాకో వందిచ్చు కొని మరి నిష్క్రమిస్తాడు' అని రాసుకున్నాడు. 2013 లో అలిశెట్టి ప్రభాకర్ కవితా సంపుటి రావడం లోను వెంకటేశం ప్రధానపాత్ర పోషించాడు.

కరీంనగర్ జిల్లా కల్లోల కాలంలో ఆయన ఆనాటి యువతకు సాహితీ, సాంస్కృ తిక, సామాజిక ఉద్యమాలను పరిచయం చేసి ముందుండి వారిని నడిపించారు. ఆ గురుస్థానం ఇంకా అందరి గుండెల్లో చిరస్థాయిగా ఉంది. కవిత్వం పట్ల అత్యంత ప్రేమతో 1980 దశకంలో దిక్సూచి అనే కవితా సంచికలు వెలువరించారు. అలిశెట్టి దీర్ఘకవిత 'నిజరూపం' అందులోనే వచ్చింది. కరీంనగర్ బుక్ ట్రస్ట్ ఆరంభించి అల్లం రాజయ్య భూమి కథలు, బి ఎస్ రాములు బతుకు పోరు నవలను ప్రచురించారు. ఆదిలాబాద్ కు చెందిన న్యాయవాది విద్యాసాగర్ రెడ్డి దేశంలో ఆర్థిక రంగ మార్పులను సూచిస్తూ రాసిన మూడు ఇంగ్లిష్ పుస్తకాల ను వెంకటేశం తెలుగులోకి అనువదించారు. సేంద్రియ వ్యవసాయ నిపుణులు సుభాష్ పాలేకర్ వ్యవసాయ విధానాల పైనా రాసిన ఆంగ్ల పుస్తకాన్ని కూడా తెనిగించారు. వితరణ శీలత వెంకటేశం మరో సుగుణం. తన పింఛనుతో చాల భాగం లేనివారిని ఆదుకోవడానికి వినియోగించేవాడు.ఇలా ఆయన లక్షల రూపాయలు వెచ్చించారని చెప్పవచ్చు. ఎందరో కవులు, రచయితలకు పుస్తక ప్రచురణ కోసం ఆర్థిక సహాయం అందించారు. సాహిత్యంలో ఏ ప్రక్రియలో అయినా రాసే సత్తా ఉన్న ఆయన రాయడం కన్నా రచయితలను ప్రోత్సహించడమే తన పనిగా పెట్టుకొన్నాడు. నచ్చిన పుస్తకాలను పదుల సంఖ్యలో కొని చదవమని పంచడం ఆయనకు ఇష్టంమైన వ్యాపకం.

1948 లో సిరిసిల్లలో జన్మించిన వెంకటేశం నిజామాబాద్ లో పాలిటెక్నిక్ చేసి విద్యుత్ శాఖలో చేరారు. చెన్నైలో ఏ ఎం ఐ ఈ చేసి ఇంజనీర్ గా పదవోన్నతి పొంది విధులను నిర్వహించారు. 1970 దశకంలో అప్పటి కరీంనగర్ జిల్లాలో విద్యుత్తు సదుపాయాల విస్తరణ పెద్ద ఎత్తున జరిగింది. ఆ సమయంలో ఇంజనీర్ గా ఆయన పల్లె పల్లె తిరుగుతూ ఊర్లలో వీధి దీపాలు, బావులకు మోటార్ల కోసం కరెంటును అందించారు. ఇప్పటికి అక్కడి గ్రామాల ప్రజలు ఆయన సేవల్ని కొనియాడుతుంటారు. 31-8-2022 రోజున నిజాం వెంకటేశం తల్లి సత్యమ్మ చనిపోయారు. ఆయనను ఓదార్చ డంలో ఉన్న సన్నిహితులకు వెంకటేశం మరణం అశనిపాతమైంది. పెద్ద దిక్కును కోల్పోయిన పక్షం రోజులకే వెంకటేశం చనిపోవడం అత్యంత విషాద కరం. ఇది వారి కుటుంబానికి కోలుకొని దెబ్బనే. ఆయన నిష్క్రమణతో తెలుగు పుస్తకం ఒక చేయూతను కోల్పోయింది. అలవోకగా అందరి కవితలు చదివే స్వరపేటిక మూగపోయింది. నడిచే గ్రంథాలయం కూలిపోయింది. తనను ఎప్పుడూ చంకన ఎత్తుకొని తిరిగే తండ్రి వెళ్లిపోయాడని పుస్తకమే రోదిస్తోంది.

ఆయనకు భార్య మాధవి, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురు విశాల అమెరికా నుంచి వచ్చాక అంత్యక్రియలు 20 వ తేదీ మంగళవారం మధ్యాహ్నం జరిగాయి. సికింద్రాబాద్ లోని ఆయన గృహానికి బంధువులతో పాటు ఎందరో రచయితలు, సాహితీప్రియులు, మిత్రులు వచ్చి కడసారి చూపుతో ఆయనకు కన్నీటి వీడ్కోలునిచ్చారు. తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ జి.రాజేశం గౌడ్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, ప్రెస్ అకాడమి చైర్మన్ అల్లం నారాయణ, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ అయాచితం శ్రీధర్, బిసి కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, సి ఎం ఓ ఎస్ డి శ్రీధర్ రావు దేశ్ పాండే, బిసి కమిషన్ మాజీ చైర్మన్ బి ఎస్ రాములు, జానపద పరిశోధకులు జయధీర్ తిరుమలరావు, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు నాళేశ్వరం శంకరం, వీక్షణం ఎడిటర్ ఎన్ వేణుగోపాల్, ప్రజా మంటలు ఎడిటర్ సి హెచ్ వి ప్రభాకర్ రావు తదితరులు వెంకటేశం పార్థివ దేహానికి తమ నివాళులు అర్పించారు. నగరానికి చెందిన రచయితలు భూపాల్ రెడ్డి, నాగసూరి వేణుగోపాల్, ఒమ్మి రమేష్ బాబు, ఆడెపు లక్ష్మీపతి, సంగిశెట్టి శ్రీనివాస్, కోడం పవన్ కుమార్, కూర చిదంబరం, ఎం. నారాయణ శర్మ, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్, డా. జతిన్ కుమార్, కోయ చంద్ర మోహన్, డా. సూర్యప్రకాష్, మంద భీం రెడ్డి, దాసరి నాగభూషణం, గుండేటి గంగాధర్ తదితరులు తుది వీడ్కోలు పలికారు. కరీంనగర్ నుంచి వచ్చిన సాహితీవేత్తలు, రచయితలు నలిమెల భాస్కర్, అన్నవరం దేవేందర్, బూర్ల వెంకటేశ్వర్లు, గాజోజు నాగభూషణం, తుల రాజేందర్, తుమ్మేటి రఘోత్తం రెడ్డి, డా॥ చెన్నకేశవరెడ్డి నివాళి ఘటించారు. 'అమర్ హై నిజాం వెంకన్న!' అను నినాదాలతో భువిని విడిచిన వెంకటేశం అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా కొలువై ఉంటారు.





నిజాం వెంకటేశం పార్థివ దేహానికి నివాళులర్పించిన అన్నవరం దేవేందర్, సి.హెచ్.వి ప్రభాకరరావు, ఎన్, వేణుగోపాల్, అల్లం నారాయణ, భూపాల్, బి.యస్.రాములు, నారదాసు లక్ష్మణరావు, డా॥ నాళేశ్వరం శంకరం తదితరులు.

### నిజాం వెంకటేశానికి కన్నీటి వీడ్కోలు



ప్రముఖ కవి, సాహితీవేత్త, అనువాదకులు నిజాం వెంకటేశానికి పలువురు కవులు, రచయితలు, సాహితీవేత్తలు, రాజకీయ ప్రముఖులు నివాళి అర్పించారు. వెంకటేశం (74) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. సిరిసిల్లకు చెందిన ఆయన పద్మారావునగర్‌లో స్థిరపడ్డారు. మంగళవారం పెద్దసంఖ్యలో పద్మారావునగర్‌లోని ఆయన నివాసానికి తరలివచ్చి నివాళి అర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్, మాజీ మంత్రి రాజేశంగౌడ్, సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు,బి.యస్.రాములు తదితరులు పాల్గొన్నారు. ముషీరాబాద్‌లో అంత్యక్రియలు ముగిశాయి.

### నిజాం వెంకటేశం మృతి సాహిత్యరంగానికి తీరని లోటు:సీఎం కేసీఆర్

ప్రముఖ సాహితీవేత్త, ఎంతో మంది రచయితలను ప్రోత్సహించిన నిజాం వెంకటేశం మరణం సాహిత్య రంగానికి తీరని లోటు అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. ఆయన మృతి పట్ల సోమవారం ఓ ప్రకటనలో కేసీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు సీఎం తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. తెలంగాణ రచయితలు, కవుల బాగోగులను కనిపెట్టుకుని వారికి చేయూతనందించి, తెలంగాణ సాహిత్యం పట్ల నిజాం వెంకటేశం కనబరిచిన ఆత్మీయతానుబంధం గొప్పదన్నారు. సిరిసిల్లకు చెందిన నిజాం వెంకటేశం మరణం పట్ల మంత్రి కేటీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. తెలంగాణ సాహిత్య రంగానికి ఆయన చేసిన సేవలు ఎంతో గొప్పవన్నారు.

